

మా తలిదండ్రులను తాను కూడా అమ్మా, నాన్న అని మాతోపాటే పిలుస్తున్నాడు. ఏం తోచనప్పుడు నేను కూడా అతని గదికెళ్ళి కావలసిన పుస్తకాలు తెచ్చుకుంటున్నాను.

*

ఒకరోజు అనుకోకుండా బజార్లో ఆలశ్యమైంది. బస్సు స్టాపులో వచ్చి నిలబడ్డాను. ఎంతసేపటికీ బస్సు రావటము లేదు. చుట్టూ కుర్రకారు గొడవ ఎక్కువైంది. అంతలో దూరంగా రమణ కనపడ్డాడు. నావైపు వీపు పెట్టి స్నేహితునితో మాట్లాడుతున్నట్లు ఉన్నాడు. 'హమ్మయ్య' అనుకొని, అతన్ని తోడు తీసుకొని యింటికెళ్దామనుకొని, వడివడిగా అటు నడిచాను. దగ్గరకెళ్ళి పేరు పెట్టి పిలుద్దామన్నంతలో, రమణ స్నేహితునితో మాట్లాడుతున్న మాటలు పెద్దగా వినపడుతున్నాయి. "నాకు గది అద్దెకిచ్చిన వాళ్ళమ్మాయి ఒకతుందిరా. ఈ మధ్యే లైనులో పడుతున్నట్టుంది. అప్పుడే అలా ముఖం పెట్టి చూడకురా. నిదానంగా నా వల్లో పడనీ – చెప్తా" అంతే। ఆ తర్వాత నాకింకేమీ వినపడలేదు. ఎలా రిక్షా ఎక్కి యింటికి చేరానో నాకే తెలీదు।

—ఇందు

• కీలకం

సిటీబస్సు ఆలస్యంగా రావడంవల్ల ఆరోజు ఆఫీసుకు చేరేసరికి కొంచెం లేటయింది. ఆఫీసు రూంలో అడుగు పెడుతుంటే మా హెడ్‌క్లార్కు స్వరం కొంచెం హెచ్చుస్థాయిలో విన్పించింది.

"మీ టైపింగ్‌లో ప్రతి లైనులోను తప్పులు వున్నాయి. స్పేసింగు కూడా సరిగ్గా లేదు. పై ఆఫీసుకు పంపే కాగితాలు యిలా టైపుచేస్తే కుదరదు." హె॥క్లా ధోరణి అత్తగారు, కొత్త కోడలు సంవాదం ఫక్కీలో ఉంది. ఆఫీసు రూంలోకి వెళ్ళగానే హె॥క్లా ఎదురుగా ఒక కొత్త అమ్మాయి నిల్చొని ఉంది. పాపం ఆ అమ్మాయి మొహం వెలవెల పాలిపోయింది. 'బహుశ కొత్తగా అప్పాయింటయిన సునంద యీమే కావచ్చు' అనుకొన్నాను.

నేను నా పని చేసుకొంటున్నాను. కాని, ఏదో అవ్యక్తమైన బాధపడ్డాను. బహుశ తోటి స్త్రీని, అందులోను కొత్తగా ఉద్యోగంలో చేరిన అమ్మాయిని కించపరచినందువల్ల కావచ్చు. మా హె॥క్లా మనస్తత్వం నాకు బోధపడలేదు. వయస్సు 30–35 ఏళ్ళకుమించి ఉండవు. చదువుకున్న భార్య ఉంది. ఎక్కడో ఉద్యోగం చేస్తోందని కూడా విన్నాను. సునంద మళ్ళీ టైపు చేసిన కాగితాలు తీసుకొని వెళ్ళి చూపించింది. కాని హె॥క్లా ముఖంలో సంతృప్తి కనిపించలేదు.

"ఉద్యోగంలో కొత్తగా జాయినయ్యారు కనుక తన అధికారం చూపడం కొరకు హె॥క్లా అలా మాట్లాడి వుంటారు. మీరేమీ బాధపడకండి" అన్నాను కాస్త ఓదార్పుగా, లంచ్ టైంలో సునందతో పరిచయం చేసుకొన్నాక.

"చూడండి, నా వర్కులో లోపాలు చూపినందుకు నేను బాధపడలేదు. కాని ఉద్యోగంలో యీ రోజునే చేరిన నేను మీకందరికీ యీ విధంగా పరిచయం అయినందుకే బాధపడుతున్నాను" సునంద ముఖంలో జాలి గోచరించింది. వెంటనే ఓ చిరునవ్వు నవ్వి టాపిక్ మార్చింది. నేను స్థాణువునై పోయాను సునంద హుందాతనానికి.

హె॥క్లాతో ఏదో ఫైలు డిస్కస్ చేస్తూ, టేబిల్‌మీద సునంద టైపు చేసిన కాగితాలు చూచాను. హె॥క్లా చెప్పింది కరక్టే. సునందకు టైపింగ్‌లో అనుభవం తక్కువ. మర్నాడు సునంద మామూలుగానే టైపు చేసింది. హె॥క్లా బయటినుంచి వచ్చిన ఫోనుకాల్సు, ఆఫీసరు ఇంటర్‌కమ్ ఇనస్ట్రక్షన్సుతో చాలా బిజీగా ఉన్నారు. సాయంత్రం ఇంటికి వెళ్ళేముందు హె॥క్లా సునందను పిలిచి, సబార్డినేట్ ఆఫీసెస్‌కు వెళ్ళే కాగితాలు టైపు చేయమని, నెమ్మదిగా పని నేర్చుకోమనీ నవ్వుతూ చెప్పారు. హె॥క్లా ముఖంలో ముందురోజు విసుగు స్థానంలో ప్రసన్నత చోటు చేసుకొంది. నేను రెండోసారి ఆశ్చర్యపోయాను హె॥క్లా మనస్తత్వంలో మార్పుకు.

ఇంటి వెళ్ళిపోతుంటే మా మెసెంజరు చెప్పాడు–సునంద ఇంకో పెద్ద ఆఫీసులోని సూపరెంటెండెంటుగారమ్మాయని। మా హెడ్‌క్లార్కు భార్య ఆయన దగ్గర గుమస్తా।

—పప్పు సత్యవాణి



## మీ భాషాభివృద్ధికి

ఇక్కడ పది మాటలున్నాయి. అయితే, ఒకేలా వున్న రెండు మాటల్లోనూ ఏదో ఒకటే సరైనది. మీ ఉద్దేశంలో ఏది రైటు అనుకుంటారో ఓ కాగితం మీద రాసుకోండి. అన్నీ అయిన తర్వాత, ఇక్కడే వున్న 'సమాధానం'తో మీ సమాధానాల్ని సరి చూసుకోండి. అన్నీ రైటే అయితే, మీకు మీ మాతృభాషలో బాగా ప్రవేశం వున్నదన్నమాటే. ఐదు తప్పులు వచ్చాయనుకోండి—మీరు మరి, బాగా కృషి చెయ్యాలన్నమాట।

| | | |
|---|---|---|
| 1. | దిస | దిశ |
| 2. | నేరస్థుడు | నేరస్తుడు |
| 3. | శ్రేష్టము | శ్రేష్ఠము |
| 4. | సమష్టి | సమిష్ఠి |
| 5. | సరుకు | సరకు |
| 6. | వ్యవస్త | వ్యవస్థ |
| 7. | సౌష్టవము | సౌష్ఠవము |
| 8. | శంఖు | శంకు |
| 9. | ధ్రువము | ధృవము |
| 10. | భాష్పము | బాష్పము |

జవాబులు: 1. దిశ 2. నేరస్థుడు 3. శ్రేష్ఠము 4. సమష్టి 5. సరుకు 6. వ్యవస్థ 7. సౌష్ఠవము 8. శంకు 9. ధ్రువము 10. బాష్పము